విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

నేడు స్పందన కార్యక్రమం

విశాలాంధ్ర -ఏలూరు : ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లోని గోదావరి సమావేశ మందిరంలో నేటి సోమవారం ఉదయం గం.10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాలల్లోను 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తారన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతిక దూరం పాటించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లాలో ఎస్ఐల బదిలీలు

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : జిల్లాలో 6 గురు ఎస్ఐలను బదిలీలు చేస్తూ ఎస్పి యు.రవి ప్రకాష్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఎన్. శ్రీనివాసరావు భీమవరం వి ఆర్ నుండి పాలకో డేరు పిఎస్ కి,సిహెచ్.ఎస్.రామచంద్రరావు. పాలకోడేరు పిఎస్ నుండి భీమవరం డి సి ఆర్ బి కి, ఏ జి ఎస్ మూర్తి భీమవరం డి సి ఆర్ బి నుండి కాళ్ల పిఎస్‌కు, ఆర్. మల్లికార్జునెడ్డి కాళ్ల పిఎస్ నుండి భీమవరం ట్రాఫిక్ పి.ఎస్‌కి, బి. మోహన్‌రావు భీమవరం ట్రాఫిక్ నుండి భీమవరం రూరల్ పి.ఎస్ కి, వి. అప్పలరాజు భీమవరం రూరల్ పి.ఎస్ నుండి భీమవరం విఆర్ కి, బదిలీల ఉత్తర్వులు జారీ చేశారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామం ఎస్సీ ఏరియాలో యారరపు రాజేష్ (పండు) (34) మృతి చెందినట్లు ఆదివారం చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు అందింది. సమాచారం అందుకున్న గణపవరం సీఐ సుభాష్, ఎస్సై కె. స్వామి సంఘటన ప్రదేశానికి వచ్చి పరిశీలించారు. మృతి పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజేష్ మృతిపై పోలీసులు అన్ని కోణాల్లో క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు. ఉంగుటూరు గ్రామానికి చెందిన రాజేష్ అదే గ్రామానికి చెందిన ఓ వివాహిత మహిళతో అక్రమ సంబంధం నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున రాజేష్ వెళ్లి ఆమెతో గొడవ పడినట్లు తెలుస్తోంది. గొడవలో రాజేష్ ను ఆమె నెట్టగా క్రిందపడి తలకు గాయమై చనిపోయినట్లుగా చెప్తున్నారు. రాజేష్ మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఉద్యోగి మృతి

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ సహాయకుడు భోగరాజు ఫణికుమార్ గుండెపోటుతో ఆదివారం ఆశ్రమ హాస్పిటల్లో మృతి చెందారని రెవెన్యూ ఉద్యోగులు తెలిపారు. ఫణికుమార్(55) మృతదేహాన్ని స్వగ్రామమైన ద్వారకాతిరుమల తరలించారు. అక్కడ అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు ఇటీవల ఆయన గుండెకు స్టంట్ వేయించుకున్నారు. ఆదివారం నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు మళ్లీ ఆశ్రమ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అక్కడ గుండెపోటుతో మృతి చెందారు. ఫణి కుమార్ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి ఆత్మహత్య

విశాలాంధ్ర - ఏలూరు క్రైమ్ : ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి హరీష్ బాబు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హరీష్ బాబు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఢిల్లీలో అకౌంటెంట్ గా పనిచేస్తున్నారు. ఈనెల 16వ తారీకు వివాహం జరగాల్సి ఉండగా ఇంట్లో కి ఉరి వేసుకుని హరీష్ ఆత్మహత్య చేసుకోవడంతో మృతి పలు అనుమానాలకు దారితీస్తుందన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పోలీసులు విచారణ నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: ఆటోని ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ కి తీవ్ర గాయాలయ్యాయి ఆదివారం దర్భ గూడెం గ్రామంలో ఆటోని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో ముందుభాగం నుజ్జు నుజ్జు అయ్యింది. ఆటో డ్రైవర్ జంగారెడ్డి గూడెం మండలం ఏ పోలవరం గ్రామానికి చెందిన అంజి బాబును స్థానికులు హుటా హుటిన జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్నాడు.

చలనచిత్ర రంగానికి వాణి జయరాం మృతి తీరని లోటు

విశాలాంధ్ర-టి నరసాపురం: సుప్రసిద్ధ సినీ గాయకురాలు వాణి జయరాం మృతి చలనచిత్ర రంగానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ తాడిగడప వెంకట సత్తిరాజు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. 19 భాషల్లో వేలాది పాటలు పాడి కోట్లాది మంది అభిమానుల మన్నలను పొందారని తెలిపారు. స్వాతికిరణం, శృతిలయలు, శంకరాభరణం, స్వర్ణకమలం లాంటి చిత్రాల్లో పాటలు పాడారని ఆయన తెలిపారు. ఆమె మృతి చలనచిత్ర రంగానికే కాక సమాజంలో వివిధ సంస్థల్లో గాయకులుగా ఉన్న అనేక మందికి తీరని లోటని అన్నారు. ఆమె మృతికి సబ్బి కనకారావు, సీనియర్ బుర్రకథ కళాకారులు వీరమళ్ళ సత్యనారాయణ, బి. నందకుమార్, టివి బ్రహ్మాచారి, పౌరాణిక రంగస్థల కళాకారులు తోట సత్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ, ప్రజా కళల అభిమాని ఎస్కే జాకీర్ హుస్సేన్ తదితరులు వాణీ జయరాం మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మండలంలోని దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన మల్లిపూడి మాధవి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న కొయ్యలగూడెం మానవతా సంస్థ రూ.4వేలు, గ్రామానికి చెందిన గెడ సుబ్బారావు రూ.5వేలు ఆర్థిక సహాయం ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వెంచర్లలో...వంచన

- రియల్ ఎస్టేట్ యజమానుల దందా
- 10 శాతం స్థలాల అప్పగింత ఏది?
- ప్రభుత్వం చర్యలు తీసుకుని స్వాధీనం చేసుకోవాలి
- ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు ఎంతో ఉపయోగం

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: జిల్లా అభివృద్ధి చెందే కొద్ది రియల్ ఎస్టేట్ వెంచర్లు ఎక్కువ అవుతున్నాయి. నిబంధనల ప్రకారం ఒక్కో వెంచర్‌లో 10 శాతం స్థలాన్ని ప్రజోపయోగ కార్యక్రమాల నిమిత్తం కేటాయించాలి. పార్కు కోసమో, ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసమో ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. కానీ సంబంధిత అధికారులు మామూళ్లకు ఆశపడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నారు. రియల్టర్లకు సహకరిస్తూ ప్రభుత్వానికే కాకుండా ప్రజలకూ తీరని ద్రోహం చేస్తున్నారు. నగరాలు, పట్టణాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో వార్డు సచివాలయాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అనివార్యంగా అవసరం అవుతుంది. రియల్ ఎస్టేట్ లలో ప్రభుత్వానికి చెందాల్సిన 10 శాతం స్థలం పక్కాగా స్వాధీనం చేసుకుంటే ప్రజాధనం కోట్లలో ఆదా అయ్యే అవకాశం ఉంది.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

రియల్ ఎస్టేట్ వెంచర్లకు సంబంధించి కొంత మంది మాత్రం పక్కాగా నిబంధనలు పాటిస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుమును చెల్లించి అన్ని రకాల అనుమతులు తీసుకొని వస్తూ మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ ముందుకు సాగుతున్నారు. మరి కొంతమంది అటువంటి కార్యక్రమాలు ఏమి చేపట్టకుండానే ప్లాట్లు వేసేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. అన్ని రకాల అనుమతులు పొందిన పొందిన వారు, పొందని వారు అనుమతులు పొంది ఆదరణ లభించక ఆగి ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్లు ఎవరైనా ప్రభు త్వానికి 10 శాతం భూమిని తమ వెంచర్‌లో ప్రజోపయోగ కార్యక్రమాల నిమిత్తం అనగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పార్కుల కోసం, ప్రభుత్వానికి స్వాధీనం చేయాల్సి ఉంటుంది. ఒకటో, రెండో రియల్ ఎస్టేట్ వెంచర్ల నుంచి మాత్రమే ప్రభుత్వానికి స్వాధీనం చేస్తున్నారు. మిగిలిన వెంచర్ల నుంచి భూమి ప్రభుత్వానికి స్వాధీనం చేయడం లేదు. సంబంధిత అధికారులు రియల్ ఎస్టేట్ యజమానులతో కుమ్మక్కు అయ్యి ప్రయోజనాలు పొందుతూ మమ అనిపిస్తుండ డంతో ఆ స్థలాలను కూడా యజమానులు ఏదో ఒక విధంగా అమ్ముకుంటున్నారు.

ప్రభుత్వానికి భూమి అవసరం

ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టిన తరువాత సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో రైతు భరోసా కేంద్రాలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు వంటివి ముమ్మరంగా నిర్మాణం చేపడుతున్నారు. కొన్నిచోట్ల స్థలాలు లేక నిర్మా ణాలు ఆగిన సందర్భాలు ఉన్నాయి.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొన్ని పట్టణ ప్రాంతాలు పురపాలకలలో భాగం కానున్నాయి. ప్రజల అవసరా లకు తగ్గట్టుగా సచివాలయాలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వీటన్నిటికీ స్థలాలు అవసరమైన నేపథ్యంలో జిల్లాలో ఉన్న అన్ని పాత, కొత్త రియల్ ఎస్టేట్ వెంచర్లపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించి పక్కాగా ప్రభుత్వానికి రావాల్సిన భూమిని స్వాధీన పరుచుకుని రక్షణ ఏర్పాట్లు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

చట్టాలలో మార్పులు రావాలి

చట్టాలలో ఉన్న లొసుగులను ఆసరాగా తీసుకుని రియల్టర్లు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో కుమ్మక్కు అవుతూ ప్రభుత్వానికి కేటాయించిన 10 శాతం భూమిని కూడా ప్లాట్లుగా అమ్ముకుంటూ కోట్లు సంపాదిస్తున్నారు.

రియల్ ఎస్టేట్‌లకు సంబంధించి ముఖ్యమైన అనుమతులైన డిటిపిసి, ఇతర అనుమతులు ఇచ్చే సమయంలో 10 శాతం స్థలం పక్కాగా ప్రభుత్వానికి స్వాధీనం చేసినట్లు రుజు వులు, ఆన్ లైన్‌లో కూడా సంబంధిత స్థలం క్రయవిక్రయాలపై నిషేధం వంటి నిబంధనల అమలుతో ఆయా స్థలాలను సేకరించి పెట్టుకోగలిగితే భవిష్యత్తులో ప్రభుత్వాలకు కోట్ల రూపాయల ప్రజాధనం వృథా ఆగడంతో పాటు ప్రభుత్వ భవనాల నిర్మాణానికి కూడా ఎంతో ఉప యుక్తంగా ఉంటుందనడంలో సందేహం లేదు.

ఆ దిశగా జిల్లా అధికార యంత్రాంగం సరైన చర్యలు తీసుకుని తాజాగా ప్రభుత్వం చేప ట్టిన భూ సర్వేలో భాగంగా చేసి ముందుకు పోవలసిన అవసరం ఉంది.

మట్టి తోలకాలకు అనుమతులు పొందాలి

విశాలాంధ్ర - లింగపాలెం : జగనన్న ఇళ్ళకు మట్టిని తోలుకునేందుకు అధికారులు పలు నిబంధనలు విధించారు. జగనన్న ఇళ్ళ పేరుతో అక్రమ తవ్వకాలు అడ్డుకునేందుకు ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. మట్టి కావాల్సిన జగనన్న ఇళ్ళ లబ్దిదారులు మట్టి కోసం వ్యక్తిగతంగా దరఖాస్తు చేయాలి. లబ్దిదారుని పేరు, ఫోన్ నెంబర్, లేఅవుట్ గుర్తింపు స్థలం దరఖాస్తులో నమోదు చేయాలి. మట్టి ఎక్కడ నుంచి ఏ సర్వే నెంబరులో తవ్వుతున్నారో తెలపాలి. లబ్దిదారునికి ఎంత మట్టి కావాలి, ఎన్ని రోజులు పడుతుందో గుర్తించాలి. మట్టిని తవ్వే జెసిబి నెంబరు, మట్టిని తోలే వాహనాల నెంబర్లు ముందుగానే తెలపాలి. దరఖాస్తులను ఎంపిడిఓ, గృహ నిర్మాణశాఖ అధికారులు ధృవీకరించాలి. పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు ఇరువురు మట్టిని జగనన్న కాలనీ లబ్దిదారులకే సరఫరా చేస్తామని సంతకాలతో హామీ పత్రం ఇవ్వాలి. వీటన్నిటికీ పంచాయతీ తీర్మానం ఉండాలి. తోలుకునే మట్టికి చలానా చెల్లించాలి. ఈ పత్రాలన్నింటిని తహశీల్దార్‌కు సమర్పించాలి. ఇవన్ని న్యాయబద్ధంగా ఉంటే పంపుతారు. దీనిని బట్టి ఇరిగేషన్, గనుల శాఖాధికారులు అనుమతులు ఇస్తారు. మట్టిని పగటిపూట మాత్రమే తోలాలి. రాత్రి సమయంలో తోలకూడదు.నిబంధనలు ఇలా ఉంటే జగనన్న కాలనీలలో ఇళ్ళు నిర్మాణం ప్రారంభించని ప్రాంతాలలో ఈ ఇళ్ళకు మట్టి కావాలంటూ కొందరు పైరవీలు చేస్తున్నారు. గతంలో ఇష్టానుసారంగా మట్టి తవ్వటంపై ఉన్నతాధికారులు పకడ్బందీగా నిబంధనలు విధించారు. దీనిపై ప్రతీరోజు వీడియోకాన్ఫరెన్సులో అధికారులు పరిశీలన చేస్తున్నారు. నిబంధనలు ఎలా ఉన్నా అనేక మంది అడ్డగోలుగా మట్టిని తోలుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై మండల స్థాయి అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్ళు రావటంతో వీరు తలలు పట్టుకుంటున్నారు. ఇటువంటి ఒత్తిళ్ళు లేకుండా చేయాలని కోరుతున్నారు. ఒత్తిళ్ళకు లొంగవద్దని అక్రమంగా మట్టిని తవ్వితే వాహనాలు సీజ్ చేయాలని, తవ్వకాలు జరుపుతున్న వారిపై చట్టపరంగా ఫిర్యాదులు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర-భీమవరం: జగనన్న కాలనీలలో గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని, టిడ్కో లబ్దిదారులకు గృహాలు తక్షణమే అంద జేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగు తుందని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని అన్ని పట్టణ, మండల కేంద్రాలనుంచి పార్టీ శ్రేణులు, జగనన్న,టిడ్కో గృహాల లబ్ధిదారులను సమీకరించి ధర్నా విజయవంతానికి కృషి చేయాలని కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

విశాలాంధ్ర-పెనుమంట్ర: మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు వాలి ప్రమా దంగా మారాయి. ఆలమూరు సబ్ స్టేషన్ పరిధిలో ఆలమూరు నుండి ఓడూరు గ్రామం వెళ్లే ప్రధాన మార్గం పొడవునా విద్యుత్ స్తం భాలు వాలి అత్యంత ప్రమాదంగా మారాయి. ప్రస్తుతం స్తంభాలు తీగలపై ఆధారంగా ఉన్నాయి. వీటి విషయంలో ఆలమూరు సబ్ స్టేషన్ సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా చిన్న పాటి గాలులకు స్తంభాలు కూలి గంటల తరబడి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో తీగలు తెగిపడి అనేక మంది మృత్యువాత పడుతున్న సంబంధిత యంత్రాంగం అప్రమత్తం కావడం లేదు. విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

ఇంటి నిర్మాణం చేపట్టకపోతే ఇతరులకు కేటాయిస్తాం

- హౌసింగ్ పీడీ రామరాజు

విశాలాంధ్ర-ఆకివీడు: జగనన్న కాలనీ ఇళ్ల లబ్దిదారులు ఇంటి నిర్మాణం చేపట్టకపోతే ఇతరులకు కేటాయిస్తామని హౌసింగ్ కార్పొ రేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ అల్లూరి రామరాజు అన్నారు. ఆదివారం ఆకివీడు జగనన్న కాలనీలో సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో పాల్గొన్న రామరాజు మాట్లా డుతూ ప్రభుత్వం ఇచ్చే రూ.1లక్ష 80వేలు, డ్వాక్రా ద్వారా రూ.35వేలు మొత్తం రూ. 2లక్షల 15 వేలతో ఇంటి నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇలా ఇళ్ల నిర్మాణం చేసుకోలేని పక్షంలో నిర్మాణం చేసుకోని లబ్దిదారులు వద్దనుండి ఇచ్చిన ఇంటి స్థలం వేరే లబ్దిదారుడికి కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆకివీడు నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ప్రతి లబ్ధిదారునికి ఇల్లు స్థలాలు ఇచ్చి ఇప్పుడు ఇల్లు కట్టుకునే విధంగా మంచి అవకాశం ఇస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి లబ్ధిదారుడు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ బ్యాంక్ చైర్మన్ కేశిరెడ్డి మురళి, వైస్ చైర్మన్ వంగ జోత్స్న, గుండా సుందర రామ్ నాయుడు, సిరప్ శీను, దొడ్డి జగదీష్, కౌన్సిలర్లు మొదలగు అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లకు రూ.5లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర -నరసాపురం: జగనన్న ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ నాయకులు నెక్కంటి క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. నరసాపురం రూరల్ మండలం సరిపల్లిలో సీపీఐ గ్రామ శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న క్రాంతి కుమార్ మాట్లాడుతూ జగనన్న కాలనీలలో పేదలకు ఇచ్చిన స్థలాలలో ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇచ్చిన రూ.1 లక్ష 80 వేలు సరిపోవన్నారు. నిర్మాణ వ్యయం పెరిగిన కారణంగా ఇనుము, ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇవ్వాలన్నారు. ఈ కారణంగా ప్రభుత్వం తక్షణం జగనన్న కాలనీ లబ్దిదారులకు రూ.5 లక్షలు ఉచితంగా ఇచ్చి లబ్దిదారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నిర్మాణమై ఉన్న టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యనమదుర్తి నాగేశ్వరరావు, దిడ్ల శేఖర్, గూడూరి శ్రీను, కొండేటి జయరాజు, తెన్నేటి ఇశ్రాయేలు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

రచయితలు సమాజ మార్పునకు దోహదపడాలి

విశాలాంధ్ర-భీమవరం: సమాజంలో ఉన్న దురాచారాలను, రుగ్మతలను పారదోలాలంటే కవులు, రచయితలకే సాధ్యమని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బియ్యం సాగర్ అన్నారు. ఆదివారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో చుక్కన శ్రీ అధ్యక్షతన అరసం జిల్లా స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాగర్ మాట్లాడుతూ ఎందరో అభ్యుదయ రచయితలు కవులు 1936లో ఏర్పాటు చేసిన అరసం జాతీయ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు విస్తృతంగా పనిచేస్తుందన్నారు. ప్రజలు నేడు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాజ మార్పు కోసం రచయితలు కవులు తమ రచనల ద్వారా ప్రజలను చైతన్య పరచాలని అప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. అరసం జిల్లా అధ్యక్షులు వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 11, 12వ తేదీల్లో తెనాలిలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, చాంద్ బాషా, ఉపాధ్యాయులు పాండురంగారావు, డి.రామ్ నాగేశ్వరరావు, హేమలత సత్య, శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

అగ్ని ప్రమాద బాధితులకు సీపీఐ చేయూత

విశాలాంధ్ర-కుక్కునూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండల పరిధిలోని గుండుగూడెం గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో కట్టుబట్టలతో బయటపడిన రెండు కుటుంబాలకు ఆదివారం సిపిఐ కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ.500 నగదు అందించారు. ఈ సందర్భంగా సిపిఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, సహాయ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన రెండు గిరిజన కుటుంబాలు వీధిన పడ్డాయని అన్నారు. బాధిత కుటుంబాలు పేద కుటుంబాలని, ఐటిడిఏ అధికారులు గిరిజనులను ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. పోలవరం ముంపు లో లేని గ్రామమని, వెంటనే గృహ నిర్మాణ పథకంలో ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సర్వస్వం కోల్పోయిన ఆ కుటుంబా లకు నష్ట పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వరసా నాగేశ్వరరావు,పూరెం లక్ష్మయ్య,సోడె రత్తయ్య,సోడె సురేష్, పెనుబల్లి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలోనే వైసీపీ కార్యకర్తల బాహాబాహీ

విశాలాంధ్ర - చాట్రాయి : వైసీపీ కంచుకోటలో ఏక నాయకత్వం వికటించింది. రోజు రోజుకి అంతర్గత వైరుధ్యాలు ముదురుతున్నాయి.చాట్రాయి మండల వైసీపీలో అసమ్మతి చాప కింద నీరులా వ్యాపిస్తున్నదని పలువురు అంటున్నారు. పథకాల పంపిణీ లో ఆధిపత్య పోరులో సూరంపాలెంలో వున్న చనుబండ 2వ సచివాలయంలో కృష్ణా రావు పాలెం వైసిపి కార్యకర్తలు బాహాబాహీగాతలపడ్డారు. కుర్చీలతో కొట్టుకున్నారు. కేసులు పెట్టుకున్నారు. ఇటీవల కాలంలో శాసనసభ్యులు ప్రతాప్ అప్పారావు గ్రామంలో గడపగడపకు వచ్చిన సందర్భంలో నివురు గప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి ఎమ్మెల్యే ముందు వెళ్ళగక్కారు. అడుగడుగునా ప్రశ్నల వర్షం కురిపించారు. ఎమ్మెల్యేను ఉక్కిరిబిక్కిరి చేశారు.రెడ్డి గారు ఏంటీ పరిస్థితి అని అడగటం గమనార్హం.అది మరిచిపోక ముందే శనివారం చేదోడు పథకం చివరి రోజు అయిన సందర్భంలో లబ్దిదారుల ఎంపికపై కొందరు మా పేర్లు రాలేదని ఫిర్యాదు చేయడానికి సచివాలయానికి వెళ్ళిన సందర్భంలో వాలంటీర్ మహిత భర్తకు ప్రత్యర్ధులకూ మధ్య వివాదం ముదిరింది. ఆఫీసులో పెద్దపెద్ద కేకలు వేస్తూ కుర్చీలతో పరస్పరం దాడులు చేసుకుని కేసులు పెట్టుకున్నారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఏక నాయకత్వం అనే పేరుతో మండలంలో నియంతృత్వం పెరిగిపోతున్నదని పెత్తందారీ విధానం పెరిగిపోతుందని పలువురు అంటున్నారు. బాధితులు ఎవరైనా నూజివీడు వెళ్లి ఎమ్మెల్యేకు స్థానిక పరిస్థితులు వివరించిన ప్రయోజనం లేకుండా ఉందని పలువురు అంటున్నారు. అందుకే చెప్పడానికి కూడా ఎవరు వెళ్ళడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. ఎమ్మెల్యేకు ఆ ఒక్క నాయకుడు మాటే వేదం కావడం వలన వాస్తవాలు ఏమి జరుగుతున్నాయో తెలుసుకునే పరిస్థితి లేకుండా పోయిందని పలువురంటున్నారు. స్థానిక ఎన్నికల సందర్భంలో అభ్యర్థులకు ఖర్చులకోసం ఎంఎల్ఏ నుంచి పంపించిన లక్షలాది రూపాయలు మాకు ఇవ్వకుండానే కాజేసారని కొందరు అంటున్నారు. వైసిపిలో ఊరూర బలమైన వ్యతిరేకత పెరుగుతోందని పలువురు అంటున్నారు.

స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయండి మహాప్రభో...

విశాలాంధ్ర-ఉండి: ఉండి మండలం ఎస్ ఆర్ పి అగ్రహారం బీసీ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి బీసీ, ఎస్ సి కాలనీ ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఎస్ ఆర్ పి అగ్రహారం, బీసీ కాలనీ ప్రజలు ఆదివారం అధికారులకు మొరపెట్టుకున్నారు. బీసీ కాలనీ నుంచి రోడ్డు పైకి రావాలంటే ప్రాణభయంతో బిక్కు బిక్కున ఉండవలసి పరిస్థితి ఏర్పడిందని ఇంటి దగ్గర నుంచి రోడ్డు పైకి రావాలంటే వేలాది సంఖ్యలో వాహనాలు అతివేగంగా రావడంతో రోడ్డు దాటడం ప్రాణ సంకటంగా మారిందని వాపోయారు. అనునిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు నడవడం రోడ్డుపై ట్రాఫిక్ బాగా పెరిగిందని ఇక్కడ స్పీడ్ బ్రేకర్లను వేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రతిరోజు ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయేవారు కొంతమంది అయితే, ఆసుపత్రి పాలై మంచాన పడ్డవారు మరికొందరు ఉన్నారని వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని తక్షణమే స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి పోలీస్ అధికారులకు విన్నవించుకున్నారు. సమస్య పరిష్కారం కానిపక్షంలో గ్రామస్తులు అందరూ రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమం చేస్తామని, న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తక్షణమే స్పీడ్ బ్రేకర్లు వేయించాలని గ్రామస్తులు కోరారు.

ఏసుక్రీస్తు అందరికి దేవుడు

విశాలాంధ్ర - గణపవరం: ఏసుక్రీస్తు ప్రభు అందరికీ దేవుడని జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం గణపవరం మండలం ముప్పర్తిపాడు గ్రామంలో పరిశుద్ధ పేతురు లూథరన్ దేవాలయంలో నిర్వహిస్తున్న సువార్త ఉజ్జీవ సభలలో పాల్గొని ఆయన ప్రభువు ఆశీర్వాదం పొందారు. అనంతరం భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు గ్రామ జనసేన నాయకులు బర్రె శాంతరాజు, పాలేరు నిరిక్షేన రావు, బర్రె కాంతారావు, పాల బాబి, ఉంగుటూరు నియోజకవర్గ జనసేన నాయకులు తోట పవన్ ,తానేటి జోగేశ్వరరావు ,ఇల్లిందల సురేష్ ,కాపల్లి నాగు ,కలిగెట్ల సత్యనారాయణ, గ్రామ జనసైనికులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

విశాలాంధ్ర-భీమడోలు: వినియోగదారులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని తద్వారా ప్రజారోగ్యానికి పెద్దపీట వెయ్యాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం మండలంలోని పొలసానిపల్లి గ్రామంలో రిటైర్డ్ టీచర్ మోషేన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పద్మ మినరల్ వాటర్ ప్లాంట్ ను ఎమ్మెల్యే వాసుబాబు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మోసేన్ కు ఎమ్మెల్యే వాసుబాబు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భీమడోలు జడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగా, మండల సర్పంచ్ల ఛాంబర్ అధ్యక్షులు సునీతా మాన్ సింగ్, సొసైటీ అధ్యక్షులు రావిపాటి సత్యశ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ ఇంజెటి నీలిమా జూనియర్, ఎంపిటిసిలు ముళ్లగిరి జాన్సన్, ఆజామ్, ఆల్తి గోలి, నాగేంద్రప్రసాద్, మండే సుధాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యర్రంశెట్టి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారి భగవద్గీత పారాయణం

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం అర్ధవరం గ్రామంలో ఆదివారం నూతనంగా ప్రతిష్టితమైన ఆంజనేయ స్వామివారి ఆలయం లోవిగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భీమవరంకు చెందిన చిన్నారి బొలిశెట్టి చేతన చే భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారి చెప్పే భగవద్గీత పారాయణం భక్తిశ్రద్ధలతో అలరించారు చిన్నారి పారాయణం భక్తులను ఆకట్టుకున్నది.ఈ కార్యక్రమంలోఎంపీపీ దండు వెంకటరామరాజు (అర్ధవరం రాము), గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సైకో పాలనతో ప్రజల జీవితాలు చిన్నాభిన్నం

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రంలో సైకో పాలనతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలుగు దేశం పార్టీ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బడేటి చంటి ఆరోపించారు. వైసిపి రాక్షస పాలనలో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారని అందుకే యువనేత నారా లోకేష్ పాదయాత్ర కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఏలూరు 49వ డివిజన్ కబాడీగూడెం కాలనీ వద్ద నుండి ఆదివారం టిడిపి ఇన్‌ఛార్జ్ బడేటి చంటి పాదయాత్ర నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. అనంతరం బడేటి చంటి మాట్లాడుతూ లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతుండడంతో సీఎం, మంత్రులు, ఇతర వైసిపి నాయకులకు చెమటలు పడుతున్నాయని అన్నారు. నాసిరకంగా నిర్మితమవుతున్న జగనన్న కాలనీలలోని ఇళ్ళు ఎంతకాలం ఉంటాయో తెలియక పేదలు ఆందోళన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విధంగా అన్ని వర్గాల ప్రజలను జగన్ ప్రభుత్వం మోసగిస్తోందని బడేటి చంటి విమర్శించారు.ఈ కార్యక్రమంలో నేరుసు గంగరాజు, టీ. శ్రీనివాస్, యలమల వెంకటేశ్వరరావు,అన్నవరపు వెంకటేశ్వరరావు, నీదూరి అఖిల్,వేముల రంగమ్మ,అన్నవరపు సతీష్ కుమార్, రావాడ అప్పలస్వామి, మరియు టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

22 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర-ఉండి: ఉండి బస్టాండ్‌లో ఉండి ఎస్ఐ యు.గంగాధర్ రావు ఆధ్వర్యంలో ఉండి పోలీస్ సిబ్బందితో కలిసి 22 కేజీల గంజాయి 950 గ్రాముల వెండిని ఆదివారం సాయంత్రం పట్టుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఉండి ఎస్ఐ గంగాధర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఉండి బస్టాండ్ వద్ద మూటలతో అనుమానాస్పద స్థితిలో ముగ్గురు వ్యక్తులు సంచరిస్తున్నారన్న సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అందులో 22 కేజీల గంజాయి 950 గ్రాముల వెండిని గుర్తించామన్నారు. ఈ నిందితులు విజయవాడ అడ్డాగా మలుచుకుని రాజస్థాన్ నుంచి గంజాయి వ్యాపారం చేస్తూ ఉంటారని దొంగతనాలకు పాల్పడతారని తెలిపారు. ఇప్పుడు దొరికిన ముగ్గురులో ఒక వ్యక్తి ఉండి మండలం ఉండి గ్రామంలోని శ్రీ శశి జ్యూవెలరీ లో దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ నిందితులకు ఉండి భీమవరం పరిసర ప్రాంతాలలో పరిచయస్తులు ఉన్నట్లు భావిస్తున్నామని త్వరలో వారిని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు. భీమవరంలో దిగిన ఈ నిందితులు అక్కడ వాళ్లకి అనుమానం వస్తుందని ఉండి బస్టాండ్‌లో చీకటిమయంగా ఉండటంతో ఎవరికి అనుమానం రాకుండా ఉంటుందని ఇక్కడికి వచ్చారని మాకు అందిన సమాచారంతో వీరిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ కేసును ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ గీతా రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్ వి ఎస్ నాయుడు వీఆర్వో ఎస్ గొల్ల తదితరులు పాల్గొన్నారు.